1,947కే విమాన టికెట్

ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఆఫర్

న్యూఢిల్లీ, ఆగస్టు 2: ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్..77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫ్రీడం సేల్ పేరుతో ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆఫర్ కింద ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,947గా నిర్ణయించింది. ఈ నెల 5 లోపు బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సెప్టెంబర్ 30లోగా ప్రయాణించాల్సి ఉంటుందని పేర్కొంది.

లాభాల్లో మెడ్‌ప్లస్

హైదరాబాద్, ఆగస్టు 2: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధ విక్రయ సంస్థ మెడ్‌ప్లస్ హెల్త్ అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.14.36 కోట్ల లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే మూడు రెట్లు పెరిగినట్లు వెల్లడించింది. కంపెనీ ఆదాయం కూడా ఏడాది ప్రాతిపదికన 16 శాతం ఎగబాకి రూ.1,489 కోట్లకు చేరుకున్నట్లు తెలిపింది.

ఇంటింటా ఇన్నోవేటర్ గడువు పొడిగింపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): ఇంటింటా ఇన్నోవేటర్-2024కు దరఖాస్తు చేసుకునే గడువును పొడిగిస్తున్నట్లు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ ప్రకటించింది. ఆవిష్కర్తలు తమ దరఖాస్తులను సమర్పించడానికి ఈనెల 10 వరకు అవకాశం ఉందని పేర్కొంది. ఆవిష్కరణలను 9100678543 వాట్సప్ నంబర్‌కు పంపించాలని సూచించారు.

6న ఏఐపై వర్క్‌షాపు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): కొత్తగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధస్సు పరిజ్ఞానంపై విసృత స్థాయిలో అవగాహన కల్పించేందుకు అమెజాన్ వెబ్ సర్వీసెస్‌తో కలిసి ఈ నెల 6న వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు టీ హబ్ ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా విసృతంగా వాడుకలోకి వచ్చిన ఏఐ టూల్స్ తరహాలో పరిశ్రమల అవసరాల కోసం ఉత్పాదక (జనరేటివ్)ఏఐపై ఆవిష్కర్తలు, స్టార్టప్ నిర్వాహకులు సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా అమెజాన్ వెబ్ సర్వీసు (ఎడబ్ల్యుఎస్) సహకారంతో ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నామని, ఔత్సాహికులు టీ హబ్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని టీ హబ్ ప్రతినిధి తెలిపారు.

4.5 లక్షల కోట్లు ఔట్

స్టాక్ మార్కెట్ నష్టాలతో ఒక్కరోజే భారీగా ఆవిరైన సంపద

రికార్డు గరిష్ఠాల నుంచి సూచీలు వెనుకకు • సెన్సెక్స్ 886, నిఫ్టీ 293 పాయింట్లు పతనం



ముంబై, ఆగస్టు 2: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస లాభాలకు బ్రేక్ పడింది. శుక్రవారం మదుపరులు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేశారు. దీంతో మెటల్, ఆటో, ఐటీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అమెరికా స్థూల ఆర్థిక గణాంకాలు బలహీనంగా నమోదు కావడం అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లకు రుచించలేదు. ఈ ప్రభావం భారతీయ మార్కెట్లపైనా పడింది. ఆల్‌టైమ్ హైల్లో సూచీలు ఉండటంతోనూ ఇన్వెస్టర్లు పెట్టుబడుల ఉపసంహరణకు వెళ్లాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే భారీ నష్టాలు వాటిల్లాయి. ఫలితంగా 5 రోజుల లాభాలకు తెరపడినట్టైంది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 885.60 పాయింట్లు లేదా 1.08 శాతం క్షీణించి 80,981.95 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 998.64 పాయింట్లు పడిపోవడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 293.20 పాయింట్లు లేదా 1.17 శాతం పతనమై 24,717.70 వద్ద స్థిరపడింది. ఇంట్రా-డేలోనైతే గరిష్ఠంగా 324.05 పాయింట్లు నష్టపోయింది.

రంగాలవారీగా..

రియల్టీ షేర్లు అత్యధికంగా 3.56 శాతం నష్టపోయాయి. మెటల్ 3 శాతం, ఆటో 2.97 శాతం, ఐటీ 2.05 శాతం, కమోడిటీస్ 1.83 శాతం, టెక్నాలజీ 1.79 శాతం, క్యాపిటల్ గూడ్స్ 1.70 శాతం చొప్పున క్షీణించాయి. ఇక మారుతీ సుజుకీ, టాటా మోటర్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్ షేర్లు మదుపరులను ఆకట్టుకోలేక నష్టాలను మూటగట్టుకున్నాయి. జూలైలో పడిపోయిన వాహన విక్రయాలతో ఆటో కంపెనీల షేర్లు, ఇన్ఫోసిస్‌కు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నోటీసుల కలకలంతో ఐటీ సంస్థల షేర్లు సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కొన్నాయి. ఈ క్రమంలో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 0.58 శాతం, మిడ్‌క్యాప్ 1.19 శాతం చొప్పున పడిపోయాయి.

గ్లోబల్ మార్కెట్లలో..

అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులను పరిశీలిస్తే.. ప్రధాన ఆసియా మార్కెట్లలో జపాన్, చైనా, హాంకాంగ్, దక్షిణ కొరియా సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ఐరోపాలోని కీలక దేశాల స్టాక్ మార్కెట్ల పరిస్థితీ ఇలాగే ఉన్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నలా భావించే అమెరికాలో మరోమారు ఆర్థిక మాంద్యం ఛాయలు అలుముకుంటున్నాయా? అన్న అంచనాల నడుమ మదుపరులు పెద్ద ఎత్తున పెట్టుబడుల ఉపసంహరణకు దిగారు. ఈ పరిణామం భారత్‌సహా అన్ని దేశాల ఈక్విటీ మార్కెట్లను కుదిపేసినట్టు మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. జూలైలో ఐఎస్ఎం తయారీ సూచీ 46.6కు దిగజారింది. దీంతో మాంద్యం భయాలు మళ్లీ నెలకొన్నాయని అంటున్నారు. అలాగే ఇజ్రాయెల్-హమాస్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలూ నష్టాలకు దారితీశాయని వారు చెప్తున్నారు.

మార్కెట్ విలువ డౌన్

స్టాక్ మార్కెట్ల భారీ నష్టాల నడుమ ఒక్కరోజే మదుపరుల సంపద లక్షల కోట్లు రూపాయల్లో కరిగిపోయింది. బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.4,46,003.7 కోట్లు తగ్గి రూ.4,57,16,946.13 కోట్లు (5.46 ట్రిలియన్ డాలర్లు)కు పరిమితమైంది. బీఎస్ఈ లార్జ్‌క్యాప్ 1.08 శాతం, మిడ్‌క్యాప్ 1.19 శాతం, స్మాల్‌క్యాప్ 0.58 శాతం చొప్పున పడిపోయాయి. ఉదయం ఆరంభం నుంచే సూచీలు నష్టాల్లో కదలాడగా.. సమయం గడుస్తున్నకొద్దీ మరింత తీవ్రంగా నేలచూపులు చూశాయి.

మహీంద్రా గ్రూపు సంస్థల చైర్మన్ ఆనంద్ మహీంద్రా.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో మహీంద్రా గ్రూపు పెట్టుబడులపై ఇరువురు ప్రధానంగా చర్చించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ఆటోమోటివ్ విభాగాన్ని ఏర్పాటు చేయడానికి ఆనంద్ మహీంద్రా అంగీకరించారు.

అమెరికాను భారత్ అందుకోలేదు

- **నాల్గోవంతు తలసరి ఆదాయాన్ని చేరాలన్నా 75 ఏండ్లు పట్టొచ్చు**
- **ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక**

న్యూఢిల్లీ, ఆగస్టు 2: అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకే చోదక శక్తి, ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన వృద్ధిరేటును సాధిస్తున్న దేశం అంటూ భారత్‌ను కీర్తిస్తున్న వేళ.. ప్రపంచ బ్యాంక్ విడుదల చేసిన ఓ నివేదిక అందులో నిజమెంత? అన్న అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. రాబోయే కొన్ని దశాబ్దాల్లో భారత్‌సహా 100కుపైగా దేశాలు.. అధిక ఆదాయ దేశాలుగా ఎదిగేందుకు ఎన్నో తీవ్ర అడ్డంకులను ఎదుర్కోవాల్సి రావచ్చని వరల్డ్ బ్యాంక్ హెచ్చరించింది. ఈ క్రమంలోనే అమెరికా తలసరి ఆదాయంలో ఒక్క త్రైమాసికానికి సమానమైన ఆదాయాన్ని చేరాలన్నా.. భారత్‌కు దాదాపు 75 ఏండ్లు పట్టవచ్చని అంచనా వేసింది. ఇదిప్పుడు మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నది. ప్రపంచ అభివృద్ధి నివేదిక 2024: ది మిడిల్ ఇన్‌కమ్ ట్రాప్ పేరిట తెచ్చిన రిపోర్టులో అమెరికా తలసరి ఆదాయంలో నాల్గోవంతును చేరడానికి చైనా కైతే 10 ఏండ్లు పడుతుందని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. ఇండోనేషియాకు 70 ఏండ్లు పట్టవచ్చున్నది.

కటిక దారిద్ర్యం

గత ఏడాది చివరికల్లా భారత్‌సహా 108 దేశాలను మిడిల్ ఇన్‌కమ్ దేశాలుగా వర్గీకరించారు. ఒక్కోదాని వార్షిక జీడీపీ తలసరి ఆదాయం 1,136 డాలర్ల నుంచి 13,845 డాలర్ల మధ్య ఉన్నది. ఈ దేశాల్లో 600 కోట్ల జనాభా ఉండగా.. ఇది ప్రపంచ జనాభాలో 75 శాతానికి సమానం. అలాగే ఈ దేశాల్లో ప్రతీ ముగ్గురిలో ఇద్దరు కటిక దారిద్ర్యంలో మగ్గిపోతుండటం గమనార్హం. ఇదిలావుంటే 1990 నుంచి ఇప్పటిదాకా కేవలం 34 దేశాలే మధ్య ఆదాయ ఆర్థిక వ్యవస్థల నుంచి అధిక ఆదాయ ఆర్థిక వ్యవస్థలకు ఎదిగాయని ప్రపంచ బ్యాంక్ గ్రూప్ ప్రధాన ఆర్థికవేత్త గిల్ తెలిపారు.

రికార్డుస్థాయికి ఐటీ రిటర్నులు

7.28 కోట్ల మంది దాఖలు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 2: దేశంలో ఆదాయపు పన్ను చెల్లింపుదారులు భారీగా పెరిగారు. 2024-25 అసెస్‌మెంట్ ఏడాదికిగాను 7.28 కోట్ల మంది రిటర్నులు దాఖలు చేసినట్లు ఆదాయ పన్ను శాఖ తాజాగా వెల్లడించింది. 2023-24 ఏడాది దాఖలు చేసిన 6.77 కోట్ల కంటే వీరి సంఖ్య 7.5 శాతం అధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నుల గడువు జూలై 31 చివరి రోజు 70 లక్షల మంది దాఖలు చేసినట్లు తెలిపింది. ఐటీ రిటర్నులు దాఖలు చేసిన 7.28 కోట్ల మందిలో నూతన పన్ను విధానాన్ని ఎంచుకున్నవారు 5.27 కోట్ల మంది కాగా, పాత పన్నుల విధానాన్ని కొనసాగించిన వారు 2.01 కోట్ల మంది. పన్ను చెల్లింపుదారుల ప్రాధాన్యతలు అంతకంతకు పెరుగుతున్నాయి. . ఈసారి దాఖలు చేసిన వారిలో 72 శాతం మంది ఈ పన్ను విధానాన్ని ఎంచుకోగా, 28 శాతం మంది పాత పన్నుల విధానంలోనే దాఖలు చేశారు. అలాగే కొత్తగా దాఖలు చేసిన వారు 58.57 లక్షల మంది ఉన్నట్లు పేర్కొంది. దాఖలు చేసిన వారిలో ఐటీఆర్-1 కింద 45.77 శాతం(3.34 కోట్లు), ఐటీఆర్-2 కింద 14.93 శాతం(1.09 కోట్లు), ఐటీఆర్-3 కింద 12.5 శాతం(91.10 లక్షలు), ఐటీఆర్-4 కింద 25.77 శాతం(1.88 కోట్లు), ఐటీఆర్-5 నుంచి ఐటీఆర్-7 కింద 1.03 శాతం(7.48లక్షలు) కేటగిరిల కింద దాఖలు చేశారు. వీరిలో 43.82 శాతం మంది ఆన్‌లైన్‌లో ఐటీఆర్ దాఖలు చేయగా, మిగతావారు ఆఫ్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు.

పన్ను ఎగవేతలు కూడా..

పన్ను చెల్లింపుదారులు పెరిగినట్లే పన్ను ఎగవేతదారులు కూడా రికార్డు స్థాయిలో పెరుగుతున్నారు. గడిచిన పదేండ్లకాలంలో పన్ను ఎగవేతదారులు వెయ్యి రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.9.08 లక్షల కోట్ల పన్ను చెల్లింపులకు సంబంధించి నోటీసులు జారీ అయ్యాయి. 2013014 ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.80 వేల కోట్లుగా ఉన్నది.

టార్గెట్ 'ఇన్ఫోసిస్' మూర్తి!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ కంపెనీ రూ. 32,403 కోట్ల జీఎస్టీ ఎగవేతకు సంబంధించి కర్ణాటక స్టేట్ జీఎస్టీ అధికారులు ముందస్తు షోకాజ్ నోటీసులు పంపడంపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు. ఐటీ ఉద్యోగులు వారంలో 70 గంటలు పనిచేయాలన్న నారాయణ మూర్తి కామెంట్లను ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నారు. ఇన్ఫోసిస్ జరిమానా కట్టడానికి ఎక్కువ గంటలు పనిచేయాల్సిందేనని పోస్టులు పెడుతున్నారు. కాగా ఎగవేతకు సంబంధించిన నోటీసులను వెనక్కి తీసుకొంటున్నట్టు జీఎస్టీ అధికారులు తాజాగా వెల్లడించడం గమనార్హం.

జియోథర్మల్ క్షేత్రంగా మణుగూరు!

అన్వేషణ, అభివృద్ధిపై త్రైపాక్షిక ఒప్పందం

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): భూతాపం ఆధారంగా విద్యుదుత్పత్తికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరును జియోథర్మల్ క్షేత్రంగా అభివృద్ధి చేయనున్నారు. అక్కడ 122 మోగావాట్ల జియోథర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి మూడు సంస్థలు సిద్ధమవుతున్నాయి. మణుగూరు సమీపంలోని పగిడేరు వద్ద ఏర్పాటు చేయడానికి శుక్రవారం సింగరేణి, ఓఎన్‌జీసీ, తెలంగాణ రెడ్కోల మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. దీనికి సింగరేణి సీఎండీ ఎన్ బలరాం, ఓఎన్‌జీసీ డైరెక్టర్ సుష్మారావత్, రెడ్కో జీఎం సత్య వరప్రసాద్‌లు హాజరయ్యారు. ఇప్పటికే 20 కిలోవాట్ల విద్యుదుత్పత్తికి సంబంధించిన పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతమవ్వగా, 122 మెగావాట్లకు వీలుందని ఓఎన్‌జీసీ నివేదిక వెల్లడించింది. మరికొన్ని పరిశోధనల్లో 3,500 మోగావాట్ల వరకు జియోథర్మల్ విద్యుదుత్పత్తికి అవకాశమున్నట్లుగా తేలింది.

రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి..

రోజుకు 2లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాన్ని సాధించాలని సింగరేణి సీఎండీ బలరాం అధికారులను ఆదేశించారు. రోజుకు 13.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని, రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు.

డ్రిప్ పరికరాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కంఠేశ్వర్/ఖలీల్‌వాడి, ఆగస్టు 2 : రాష్ట్రప్రభుత్వం 2024-25 సంవత్సరానికి సూక్ష్మ నీటి సేద్య పథకం ద్వారా బిందు, తుంపర్ల సేద్యానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నాయని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 924 ఎకరాల్లో 910 లక్షల ఆర్థిక లక్ష్యంతో జిల్లాలో అమలు చేయాలని ఆదేశాలు జారీ అయినట్లు పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ తోట 1250 ఎకరాలకు రూ.245 లక్షలు , పసుపు, మక్కజొన్న, కూరగాయల తోటలు 1593 ఎకరాలకు రూ. 8.69 కోట్లు, పండ్ల జాతి మెక్కలు 118 ఎకరాలకు రూ.25 లక్షలతో పథకం అమలు చేయాలని సూచించారు. తుంపర్ల సేద్యం పరికరాలకు 85 హెక్టార్లకు రూ.16 లక్షల ఆర్థిక లక్ష్యాన్ని నిర్దేశించారని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ఉద్యానవన అధికారులు.. వినాయక్-8977713982 (బాల్కొండ), మోర్తాడ్ -8977713981 (సుమన్), సంధ్యారాణి - 8977713978 (నిజామాబాద్ రూరల్), రోహిత్-8977713980 (నిజామాబాద్), వహీద్ -8977713979 (బోధన్) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగ నియమాకాల జీవో 55ను రద్దు చేసి జీవో 29ని తీసుకురావడంపై యూఎస్ఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ కాలనీలో జీవో నంబర్ 29 ప్రతులను జిల్లా కార్యదర్శి పెద్ది సూరి ఆధ్వర్యంలో శుక్రవారం దహనం చేశారు. ఈ జీవో ద్వారా ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్రనష్టం జరుగుతుందని, జీవో 55ను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

కంఠేశ్వర్, ఆగస్టు 2

అమ్మ పాలు అమృతం

దోమలెడ్గిలో తల్లిపాల అవశ్యతపై అవగాహన కల్పిస్తున్న పొతంగల్ సూపర్‌వైజర్ సుమలత(ఫైల్)

- **ముర్రుపాలలో వ్యాధి నిరోధకశక్తి**
- **ఈ నెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు**

కోటగిరి, ఆగస్టు 2 : పుట్టినబిడ్డకు తల్లిపాలు అమృతం లాంటిది. వారు ఆరోగ్యంగా ఉండేందుకు సంజీవని. పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి తల్లిపాలు చాలా కీలకం. ఆరు నెలల వరకు బిడ్డ శరీర అవసరాలన్నీ తల్లిపాల ద్వారానే తీరుతాయి. అందుకే తల్లిపాలను బిడ్డకు సంపూర్ణ ఆహారంగా పరిగణిస్తారు. గర్భిణులు, బాలింతలకు తెలిసేలా రాష్ట్ర ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటి నుంచి ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నది. ఈ నేపథ్యంలో తల్లిపాల ప్రాముఖ్యతపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం... పోతపాల కన్నా తల్లిపాలు తాగే పిల్లలు బలంగా , తెలివిగా ఉంటారన్నది నిరూపితమైన వాస్తవం. శిశువు సంపూర్ణ ఆరోగ్యంతో, రోగనిరోధక శక్తిని పొందాలంటే తల్లి పాలు పట్టించాల్సిందే. తల్లిపాలతో బిడ్డతోపాటు తల్లికి లాభాలున్నాయి. బిడ్డకు పాలు పట్టడం ద్వారా ఎన్నో రకాల వ్యాధుల నివారణకు దోహదపడుతుంది. ముర్రుపాల ప్రాముఖ్యత, బిడ్డకు ఎంత వయస్సు వచ్చే తల్లిపాలు ఇవ్వాలి, రోజుకు ఎన్నిసార్లు పాలు పట్టాలి, ఎలా పట్టాలి తదితర అంశాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నారు.

బిడ్డ పుట్టిన గంటలోపు నుంచి 6 నెలల వరకు తల్లిపాలు తప్ప మరో ఏ పదార్థాలను ఇవ్వకూడదు. తల్లిపాలు తేలికగా జీర్ణమవుతాయి. శుభ్రంగా, ఎలాంటి క్రీములు లేకుండా ఉంటాయి. శ్వాసకోశ, ఆలర్జీ, అస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలను రక్షిస్తాయి. బిడ్డ మానసిక శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి. రోజులో బిడ్డకు 8-10 సార్లు పాలు ఇవ్వాలి. ఆరు మాసాల తర్వాత నుంచి బిడ్డకు తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలి. రెండేండ్ల వరకు క్రమం తప్పకుండా పాలు పట్టాలి. దీంతో ఎలాంటి వ్యాధులు దరిచేరకుండా బిడ్డ ఎదుగుదల సక్రమంగా ఉంటుంది.

గర్భిణులకు అవగాహన కల్పిస్తాం..

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం అవగాహన కల్పిస్తారు. తల్లిపాలతో పాటు గర్భిణులు పాటించాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారంపై వివరించనున్నాం.

-రసూల్ బీ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి, నిజామాబాద్

సద్వినియోగం చేసుకోవాలి..

తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు తీస్తారు. తల్లిపాలలోని పోషకాలు, తల్లీబిడ్డలకు కలిగే ప్రయోజనాలపై వివరిస్తారు. కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలి.

-జానకీ, సీడీపీవో, ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్టు

వీధిరౌడీలా వ్యవహరించడం జుగుప్సాకరం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, ఆగస్టు 2: నిండు శాసనసభలో వీధిరౌడీలా ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యవహరించిన తీరు జుగుప్సాకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆగ్రహంవ్యక్తం చేశారు. విషయ అవగాహన లేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, సభా మర్యాదలు, సభ గౌరవాన్ని కాంగ్రెస్‌పార్టీ మంటగలిపిందని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. యథారాజ, తథా ప్రజా అన్నట్లుగా సీఎం ప్రవర్తనకు తీసిపోనట్లుగా వారి ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. మొన్న బీఆర్ఎస్ పార్టీ మహిళా శాసనసభ్యులను ముఖ్యమంత్రి, నిన్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను శాసనసభలో ఎమ్మెల్యే దానం నాగేందర్ పరుష పదజాలంతో రౌడీలగా మాట్లాడడం విచారకరమన్నారు. దానం నాగేందర్ మాట్లాడిన భాష...రౌడీషీటర్‌లా సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. శాసనసభ అంటే ప్రజల్లో ఏహ్యభావం కలిగేలా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల సమస్యలు పరిష్కరించే దేవాలయాన్ని బూతు మాటలు మాట్లాడే సభగా కాంగ్రెస్ వాళ్లు మార్చేశారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేను, సభ మర్యాదను అగౌరవపరిచే విధంగా వ్యవహరించిన ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని వేముల డిమాండ్ చేశారు.

ఎస్సారెస్పీలోకి భారీగా వరదనీరు

మోర్తాడ్, ఆగస్టు2: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి శుక్రవారం ఉదయం నుంచి భారీగా వరదనీరు వచ్చిచేరింది. శుక్రవారం 52 వేల ఇన్‌ఫ్లో వచ్చిచేరింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు) కాగా ప్రాజెక్ట్‌లో 1078.7అడుగులు (41.698టీఎంసీల) నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ నుంచి 684 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది. సరస్వతీ కాలువకు 10 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 443 క్యూసెక్కుల నీరు ఆవిరవుతున్నట్లు అధికారులు తెలిపారు.

రిమాండ్‌కు యూనియన్ బ్యాంకు మేనేజర్ తరలింపు

వినాయక్‌నగర్, ఆగస్టు 2 : జిల్లా కేంద్రంలోని బడాబజార్ యూనియన్ బ్యాంక్‌లో మేనేజర్ పినపాటి అజయ్ కుమార్ రూ. 3 కోట్లకుపైగా ఖాతాదారుల డబ్బులు కాజేసి పరారైన విషయం తెలిసిందే. పోలీసులు అజయ్‌కుమార్‌ను నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో పట్టుకొని, శుక్రవారం కోర్టులో హాజరుపర్చినట్లు నగర సీఐ నరహరి వెల్లడించారు. ప్రస్తుతం తన వద్ద డబ్బులు ఏమీ లేవని, ఆన్‌లైన్ బెట్టింగ్, షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి నష్టపోయినట్లు నిందితుడు పోలీసులతో తెలిపినట్లు సమాచారం. డబ్బులు తిరిగి చెల్లించేందుకు ఆరు నెలల గడువు కోరినట్లు తెలిసింది.

మూలన పడ్డ బతుకమ్మ చీరలు

ఎనిమిది నెలలుగా నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలోనే..

నాగిరెడ్డిపేటలోని ఐకేపీ కార్యాలయంలో సంచుల్లో ఉన్న చీరలు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 2 : గత సంవత్సరం బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆడపడుచులకు చీరలను పంపిణీ చేసింది. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా 92శాతం చీరల పంపిణీ పూర్తిచేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన చీరల్లో ఎనిమిది శాతం మిగిలిపోయాయి. వాటిని ఎనిమిది నెలలుగా నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయంలోనే ఉంచారు. ప్రస్తుతం అవి పనికి రాకుండా పోతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై ఐకేపీ డీపీఎం సుధాకర్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. హ్యాండ్లూమ్ కంపెనీ వారు బతుకమ్మ చీరలను సరఫరా చేశారని చెప్పారు. మిగిలిన చీరలను తీసుకెళ్తామని లెటర్ పంపించినట్లు తెలిపారు. కానీ.. ఇప్పటివరకు తీసుకెళ్లలేదన్నారు. చీరలను తీసుకెళ్లాలని మరోసారి సూచిస్తామన్నారు.

మత్తు పదార్థాల నిరోధానికి కృషిచేయాలి

- **టోల్ ఫ్రీనంబర్ 14446 ఏర్పాటు**
- **నషా ముక్త్ భారత్ అభయాన్ జిల్లా కమిటీ సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**

మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కంఠేశ్వర్, ఆగస్టు 2 : మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల నిరోధానికి అధికారులతోపాటు ప్రతి పౌరుడూ కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన నషాముక్త్ భారత్ అభియాన్ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై సీపీ కల్మేశ్వర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు, కమిటీ ప్రతినిధులు చర్చించారు. మాదకద్రవ్యాల రవాణా, వినియోగం తదితర కార్యకలాపాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 14446కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. మాదకద్రవ్యాల నిరోధంపై యువతకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. సమావేశ